సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 12 । అక్టోబర్ । 2023



పరీక్షా ఫలితాల విడుదల
కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఎం.ప్లాన్ (యూఆర్‌పీ) విభాగం 4వ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదల చేశారు. -8లో



రాణించిన కడప బ్యాట్స్‌మన్
కడప కేఎస్ఆర్ఎం మైదానంలో కర్నూలు జట్టుతో జరిగిన అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప క్రీడాకారులు రాణించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.132
రెండోరకం	రూ.66	రూ.98



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 223 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	380	526
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1246.160 కిలోలు

న్యూస్‌రీల్

సోమశిల ముంపు బాధితులకు అవకాశం

కడప సిటీ: సోమశిల ప్రాజెక్టు కింద ఆస్తులు ముంపునకు గురై లేదా భూ సేకరణ అవార్డు పొందిన వారు ఉద్యోగ కల్పనకు ఈ నెల 16వ తేదీలోగా వివరాలు తెలియజేయాలని సోమశిల ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీరు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీఓ 98 ప్రకారం 15.4. 1986 కంటే ముందు దరఖాస్తు చేసుకోలేని వారు వివరాలు సంబంధిత కార్యాలయంలో అందజేయాలన్నారు. గతంలో దరఖాస్తు చేసి ఉండి తిరస్కరణకు గురై ఉంటే తగిన ఆధారాలతో మళ్లీ వివరాలు ఇవ్వాలని తెలిపారు. వాటిని పరిశీలించి క్వాలిఫైడ్ అభ్యర్థుల జాబితా రూపొందిస్తామని ఆయన తెలిపారు.

14న మైసూర్‌కు ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: దసరా సెలవులు పురస్కరించుకుని ఈనెల 14న మైసూర్‌కు ప్రత్యేక స్పెషల్ బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 14న రాత్రి 9 గంటలకు మదనపల్లెలో బయలుదేరి 15న ఉదయం మైసూర్‌కు చేరుతుందన్నారు. మైసూర్‌లో ప్యాలస్, జూ, మ్యూజియం,బృందావన గార్డెన్స్, చాముండి హిల్స్, చైతన్య ఆశ్రమం చూసుకుని రాత్రి బయలుదేరి 16న ఉదయం మదనపల్లెకు చేరుకుటుందన్నారు. రానుపోను చార్జి రూ.1250 చెల్లించాలన్నారు. టిక్కెట్లు ముందుగా రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 91601 86645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

13న తలనీలాల వేలం పాట

సిద్దవటం: లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవంలో స్వామి వారికి భక్తులు తలనీలాల పోగు హక్కు కోసం, తాత్కాలిక షాపు పెట్టు కొనేందుకు (2023 కార్తీక మాసంకు, 2024 మహాశివరాత్రికి) వేలంపాట నిర్వహించనున్నారు. ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు సిద్దవటం లోని రంగనాయక స్వామి ఆలయంలో వేలం జరుగుతుందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కొండారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే ప్రతి పాటా దారుడు తలనీలాలకు ధరావత్తు కింద రూ. 1,00,000 , తాత్కాలిక షాపు పెట్టుకునేందుకు రూ. 20 వేలు చెల్లించాలన్నారు. ఏ కారణం తెలపకుండానే వేలం పాటను నిలుపుదల చేయడానికి, వాయిదా వేయడానికి ఈఓకు పూర్తి అధికారం ఉందని వారు పేర్కొన్నారు.

రేపటి నుంచి టెన్నికాయిట్ పోటీలు

బి.కొత్తకోట: బి.కొత్తకోటలో శుక్రవారం నుంచి డాక్టర్ ఏపీజే.అబ్దుల్‌కలాం అంతర్‌రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు కే.మంజునాథ్ బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు గురువారంలోగా తమ ఎంట్రీలను నమోదు చేయించుకోవాలన్నారు.డబుల్స్ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.15వేలు, రెండో బహుమతి రూ.10వేలు, మూడో బహుమతి రూ.8 వేలు, నాలుగో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సింగిల్స్ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.10వేలు, రెండో బహుమతి రూ.8వేలు, మూడో బహుమతి రూ.5వేలు, నాలుగో బహుమతి రూ.3వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట దేవాదాయశాఖ మైదానంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసులురెడ్డి



శ్రీనివాసులురెడ్డి

కడప స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ అకాడమీలో ప్రవేశాలకు నిర్వహించే ఎంపికకు సెలక్షన్ కమిటీ సభ్యుడిగా కడపకు చెందిన వ్యాయామోపాధ్యాయుడు సి.శ్రీనివాసులురెడ్డిని నియమించారు. పులివెందుల పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ ఎంపికల్లో ఈయన సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఈయన కడప నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

రాష్ట్ర జట్టుకు ఎంపిక

పులివెందుల టౌన్: పులివెందుల అకాడమీలో రాష్ట్ర స్థాయి హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్ జట్టుకు క్రీడాకారుల ఎంపిక బుధవారం జరిగింది. స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కడప స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, కన్వీనర్ సురేంద్రబాబు, శాప్ హెడ్ ఆఫీస్ స్పోర్ట్స్ అథారిటీ సీనియర్‌లు కోచ్ మహేష్(హాకీ), కోటేశ్వరరావు(వాలీబాల్), శ్రీనివాసరావు (బాస్కెట్‌బాల్), భాస్కర్ (బ్యాడ్మింటన్) ఈ ఎంపికలు నిర్వహించారు. కడప, నంద్యాల, అనంతపురం, తిరుపతి తదితర జిల్లాల నుంచి ఐదు క్రీడాంశాలకు సంబంధించిన క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం

- ప్రభుత్వ బడి గర్వపడేలా సర్కారు వినూత్న ఆలోచన
- సెల్ఫీ విత్ టాపర్స్ పేరిట విద్యార్థులకు ప్రోత్సాహం
- ఎఫ్ఏ-2 పరీక్షలతో కార్యక్రమానికి శ్రీకారం



సెల్ఫీ విత్ టాపర్స్‌తో మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, హెచ్ఎం,ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిభ మీది.. ప్రోత్సాహం మాది అనేటట్లుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'సెల్ఫీ విత్ టాపర్స్'పేరిట విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. దీనికి సంబంధించి మార్గదర్శకాలను విద్యాశాఖ విడుదల చేసింది.

ఎఫ్ఏ-2 పరీక్షలతో మొదలు...
ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్)-2 పరీక్షల నుంచి సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం అమల్లోకి రానుంది. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించడమే కార్యక్రమ ఉద్దేశం.వివిధ పక్షల్లో టాపర్లుగా నిలిచిన వారితో ఉపాధ్యాయులు,హెచ్ఎంలు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో వారి ప్రతిభను తెలియజేసేలా పోస్టింగులు చేయాలని ఆదేశించింది. ప్రతిభను ప్రోత్సహించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారనే సత్యాన్ని లోకానికి తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తద్వారా విద్యార్థుల్లోనూ పోటీతత్వం పెంపొందుతుందని భావిస్తున్నారు. ఎఫ్ఏ-2 పరీక్షలు ఈనెల 3 నుంచి 5 వతేదీ వరకుఏ జరిగిన విషయం తెలిసిందే. సబ్జెక్టు టీచర్లు పరీక్షల మూల్యాంకనం ముగిసిన తర్వాత టాపర్స్ లిస్టును ప్రిపేర్ చేసుకుని వెంటనే సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు హెచ్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమంలో కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు భాగస్వామ్యం కానున్నారు. విద్యార్థుల ప్రగతిని, వారి మార్కులను తల్లిదండ్రులకు తెలియజేసేలా పేరెంట్స్ మీటింగ్‌లను కూడా చేపట్టనున్నారు.

జిల్లాలో మండలాలు:	30
ప్రభుత్వ పాఠశాలు:	2213
బాలురు:	75,435
బాలికలు:	79,354



మంచి మార్కులు సాధించొచ్చు



నిర్మాణాత్మక పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం మంచి ఆలోచన. దీంతో విద్యార్థులలో పోటీతత్వం ఏర్పడుతుంది. తదుపరి పరీక్షలలో మంచి మార్కులు సాధించేందుకు వీలవుతుంది. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
-నామ ధీరజ్,
పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం



సెల్ఫీ విత్ టాపర్స్ మంచి కార్యక్రమం . దీని వల్ల విద్యార్థులు అభ్యసనంలో మరింత ఉత్సాహంగా పాల్గొంటారు. తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకం ఏర్పడుతుంది.
-ఎం.సుబ్బారెడ్డి,
హెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

చాలా మంచి కార్యక్రమం



సెల్ఫీ విత్ టాపర్స్ పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమం చాలా మంచిది. టాపర్‌గా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు,హెచ్ఎంలు, ఎంఈఓలు, డీవైఈఓలు, డీఈఓలు సెల్ఫీలు తీసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలి. తద్వారా ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించినట్లువుతుంది.
-శ్రీరాం పురుషోత్తం,
డిఈఓ, అన్నమయ్య జిల్లా

విద్యాప్రమాణాలు పెంచాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం

వీరబల్లె (రాయచోటిటౌన్): విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలని డీఈవో శ్రీరాం పురుషోత్తం ఉపాధ్యాయులకు సూచించారు. 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమంలో భాగంగా బుధవారం వీరబల్లె మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా డీఈఓ ప్రభుత్వం అందిస్తున్న ఐరన్, పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ ఇస్తున్నారా లేదానే విషయాలను విద్యార్థులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆంగ్లభాష బోధనపై ఎప్పటికపుడు ప్రణాళిక బద్ధంగా ఉండాలన్నారు. విద్యావిధానంలో ఇంట్రాక్టివ్‌ఫ్యాట్ ప్యానల్ , బైజ్యూస్ ట్యాబ్స్‌లను ఉపయోగిస్తున్నారా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అకౌంట్స్ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి, డీఈవో క్యాంప్ క్లర్క్ హబీబ్, డిస్ట్రిక్ట్ అసోషియేట్ సైన్స్ ఆఫీసర్ పల్లం రామచంద్ర, ప్రధానోపాధ్యాయురాలు గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రీజియన్ పరిధి నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ప్రజా రవాణాధికారి పోలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జమ్మలమడుగు డిపో నుంచి ఉదయం ఏడు గంటలకు ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా బస్సు నడుపుతామని రూ.1557 ఛార్జీగా నిర్ణయించామని తెలిపారు. మైదుకూరు నుంచి పోరుమామిళ్ల, మైదుకూరు, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా సాయంత్రం 6 గంటలకు బస్సు నడుపుతున్నామని, రూ.1414 టిక్కెట్ నిర్ణయించామన్నారు. బద్వేల్ డిపో నుంచి ఉదయం 5.30 గంటలకు బస్సు బయలుదేరి పోరుమామిళ్ల, పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా వెళ్తుందని, అల్ట్రా డీలక్స్‌లో రూ.1566, సూపర్ లగ్జరీలో రూ. 1475 ఛార్జీ ఉంటుందన్నారు. పులివెందుల డిపో నుంచి కంచి మీదుగా తిరుమన్నామలైకు రాత్రి ఎనిమిది గంటలకు బస్సు వెళుతుందని, రూ.1242 టిక్కెట్ ధర ఉంటుందన్నారు. ప్రొద్దుటూరు డిపో నుంచి రాత్రి 9 గంటలకు వెళ్లే బస్సుకు రూ.1273 ధర నిర్ణయించారన్నారు. కడప నుంచి రాత్రి 9 గంటలకు బస్సు వెళ్తుందని టిక్కెట్ రూ. 1072గా ఉంటుందన్నారు.

డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏపీ జాయింట్ కమీషనర్ నాగలక్ష్మి

పులివెందుల టౌన్: డ్రగ్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏపీ జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల మీద విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదవద్రవ్యాలు సరఫరా చేసే ముఠాలకు ఆకర్షితులై ఎంతో మంది విద్యార్థులు తమ భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటిపై మక్కువ చూపకుండా తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సీఐ రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ పాల్గొన్నారు.

అమూల్‌తో పాడిరైతుకు ప్రయోజనాలు

మదనపల్లె, రామసముద్రం: రాష్ట్రప్రభుత్వం అమూల్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో పాడిరైతుకు గరిష్ట ప్రయోజనాలు అందుతున్నాయని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్(ఏపీడీడీసీఏఫ్)ఎండీ అహ్మద్‌బాబు అన్నారు. బుధవారం మదనపల్లెలోని అమూల్ డెయిరీని సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం అమూల్ డెయిరీ రాష్ట్రవ్యాప్తంగా 2.6లక్షల లీటర్ల పాలసేకరణ జరుపుతోందని, 2024 మార్చిలోపు 5లక్షల లీటర్ల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. చిత్తూరులో అమూల్ డెయిరీ ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చేఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో 1.5లక్షల లీటర్ల పాలసేకరణ లక్ష్యంగా ప్రారంభించి రానున్న రోజుల్లో పదిలక్షల లీటర్ల సేకరణ దిశగా ముందుకెళతామన్నారు. ప్రకాశంలో రూ.400కోట్లతో డెయిరీని అభివృద్ధి పరుస్తున్నామని, యూహెచ్‌టీ ప్లాంట్, ఐస్‌క్రీమ్, ప్రాసెసింగ్ ఉత్పత్తులను తయారుచేస్తామన్నారు. మదనపల్లె అమూల్ డెయిరీ ప్లాంట్‌లో స్టెరిలైజేషన్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు స్టోరేజీ కెపాసిటీని రెండింతలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న 90,000 లీటర్ల పాలసేకరణను 1.60లక్షల లీటర్లు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

- రామసముద్రం మండలం ఎలకపల్లెలో ఉన్న అమూల్ పాల సేకరణ కేంద్రాన్ని అహ్మద్‌బాబు సందర్శించారు.అనంతరం మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువతో ఆర్థిక ప్రగతి సాధ్యమని అన్నారు.

ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడమే ధ్యేయం

ఏపీడీడీసీఎఫ్ ఎండీ, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు



ఆరోగ్య సురక్ష క్యాంపులో ప్రజలతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు, కలెక్టర్ గిరీషా

మదనపల్లె: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రప్రభుత్వం వైద్యరంగంపై అధికమొత్తంలో ఖర్చుచేస్తోంది. రోగి వైద్యం నుంచి మందులు, శస్త్రచికిత్సలు, ఇంటికి చేరేంతవరకు అన్నింటినీ ప్రభుత్వమే చూసుకుంటోంది. జగనన్న ఆరోగ్య సురక్ష నామమాత్రపు కార్యక్రమం కాదు. క్యాంపును క్యాంపులా కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా చూడాలి. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవాలి. పైసా ఖర్చుకూడా లేకుండా ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్, కో-ఆపరేటివ్ ఫెడరేషన్ (ఏపీడీడీసీఎఫ్)ఎండీ, రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు అన్నారు. బుధవారం మదనపల్లెలోని నెహ్రూమున్సిపల్ హైస్కూల్, మండలంలోని పోతపోలు గ్రామంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరాలను కలెక్టర్ గిరీషా, ఆర్డీఓ ఎం.ఎస్. మురళీతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.క్యాంపులో అందుతున్న సేవలు, ఇంటింటి సర్వేలో చేసిన పరీక్షలు, క్యాంపు నిర్వహణ, డాక్టర్ల ట్రీట్‌మెంట్ తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో క్యాంపుకు హాజరైన పేషంట్ లక్ష్మీనారాయణ స్పెషల్ ఆఫీసర్‌తో మాట్లాడుతూ..మదనపల్లెలో రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చూపించుకుంటే.. తనవద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అదనంగా వసూళ్లు చేశారని, అయినప్పటికీ వ్యాధి నయం కాలేదన్నారు. 2023 మార్చిలో కోలార్‌లోని ఆరోగ్యశ్రీ రెఫరల్ హాస్పిటల్‌కు వెళితే.. తనకు రెండు స్టెంట్లు వేశారని, ఒక్కరూపాయి ఖర్చులేకుండా నాణ్యమైన చికిత్స అందిస్తున్నారని చెప్పారు. చికిత్స తర్వాత ఫాలోఅప్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారా.? ఆరోగ్యమిత్ర వస్తున్నారా? మందులు ఇస్తున్నారా? అని అడిగితే లేదన్నారు. దీనిపై స్పెషల్ ఆఫీసర్ అహ్మద్‌బాబు స్పందిస్తూ..పేషంట్‌కు సంబంధించిన మొత్తం కేస్‌స్టడీ తనకు పంపాలని, ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో అదనపువసూళ్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పూర్తిస్థాయిలో విచారించి నివేదిక పంపాలని డీఎంహెచ్ఓ డాక్టర్.కే.కొండయ్యను ఆదేశించారు. కలెక్టర్ గిరీషా మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ ఆరోగ్యసురక్ష క్యాంపు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ మిద్దింటిధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కౌన్సిలర్‌లు గిరిజ, రజని, సర్పంచ్ ఈశ్వరయ్య, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, డీఎల్‌డీఓ లక్ష్మీపతి, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ, కమిషనర్ కే.ప్రమీల, తహసీల్దార్ మహబూబ్‌చాంద్, ఎంపీడీఓ భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 23 కేంద్రాల్లో వైద్యశిబిరాల నిర్వహణ



పుల్లంపేట మండలం రెడ్డిపల్లిలో వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు

రాయచోటి: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తోంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున మెడికల్ క్యాంపులు నిర్వహిస్తోంది. అన్నమయ్య జిల్లా పరిధిలో బుధవారం 23 ప్రాంతాల్లో నిర్వహించిన శిబిరాల్లో 9304 మంది వైద్యసేవలు అందుకున్నారు. పది రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల ద్వారా పిల్లలు, గర్భిణులు బీపీ, షుగర్, క్యాన్సర్, జ్వరపీడితులు చికిత్సలు అందుకుంటున్నారు. బుధవారం ఒక్కరోజే 162 మందిని వివిధరకాల జబ్బులకు సంబంధించిన చికిత్సలు కోసం పెద్దఆసుపత్రులకు రెఫర్ చేశారు. అనేక మంది రక్తపూతలు సేకరించి పరీక్షించారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో స్థానిక ప్రజా ప్రతినిధులు శిబిరాలను సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవల గురించి తెలుసుకున్నారు.

కడుపుకోతకు చెక్

- సిజేరియన్ల తగ్గింపునకు వైద్యశాఖ చర్యలు
- సహజప్రసవాల పెంపునకు ప్రణాళికలు
- ఆరోగ్యశ్రీ పరిధిలోకి టిఫా, అల్ట్రాసౌండ్ స్కాన్
- ప్రభుత్వ చర్యలను కొనియాడుతున్న మహిళలు





నందలూరు పీహెచ్‌సీలో గర్భిణికి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు సృజన (ఫైల్)

రాజంపేట: బిడ్డకు జన్మనివ్వడం పునర్జన్మతో సమానం.అదీ సహజ పద్ధతిలో జరిగితే తల్లీ బిడ్డ అత్యంత సురక్షితం.పుట్టే ప్రతి బిడ్డకూ ఎలాంటి ఆపద ఉండదు. కానీ కాలం మారి వైద్య సదుపాయాలు పెరిగాక చాలామంది ఆపరేషన్ల వైపు మొగ్గుచూపుతున్నారు. గర్భధారణ సమయాల్లో వచ్చే ఇబ్బందులను , కాన్పు సమయాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు మాత్రమే వైద్యులు సిజేరియన్ విధానాన్ని పాటిస్తారు.ప్రస్తుతం ఆపరిస్థితి హద్దుమీరిపోతోంది. ఈ గణాంకాలు కూడా ఆందోళనకరంగా కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు వైద్యశాఖ నడుంబిగించింది. అనవసర సిజేరియన్లు వల్ల వచ్చే అనర్థాలను, సహజ ప్రసవాలతో కలిగే మేలును గర్భిణులకు తెలియచేస్తూ సహజ ప్రసవాలను ప్రోత్సహించేందుకు సన్నద్ధమవుతోంది.

డబ్ల్యూహెచ్ఓ మార్గదర్శకాలు..
డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాల ప్రకారం 10-15లోపే సిజేరియన్లు ఉండాలి. ప్రైవేటు ఆసుపత్రుల్లో అయితే 50 శాతానికిపైగా ఆపరేషన్లు జరుగుతున్నాయి. ఈ అనవసర చికిత్స వల్ల బాలింతలు ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీ-సేఫ్‌ను ప్రారంభించనున్నారు.

నర్సులకు శిక్షణ..
జిల్లాలో 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 11 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. సహజ ప్రసవాలు పెంచే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వాసుపత్రుల్లో నర్సులకు నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్‌వైఫరీ(ఎన్‌పీఎం) కోర్సుల్లో శిక్షణ అందించనున్నారు. ఇందులో గర్భధారణ జరిగినప్పటి నుంచి మహిళలకు అవసరమైన వైద్యసదుపాయం ఎలా అందచేయాలో వివరిస్తారు. హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను ఎలా గుర్తించాలి, వారికి ఏ విధమైన వైద్యం అందించాలన్న అంశాల గురించి వివరిస్తారు. అనంతరం వీరికి నర్సింగ్‌బోర్డులో పరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు జారీ చేస్తారు. త్వరలో వీరిని రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా ప్రసవాలు జరిగే పది ఆసుపత్రులలో నియమించనున్నారు.

సీ-సేఫ్ అంటే..
అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియన్ చేయాలన్నదే 'సీ-సేఫ్'ఉద్దేశం.దీనిపై వైద్యులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తారు. సీజేరియన్ విధానలతో మాతృశిశు మరణాలు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఆపరేషన్ చేసే సమయంలో అత్యంత సురక్షిత పద్ధతులను పాటించాలని సూచిస్తారు. ఈ విధానానికి యునిసెఫ్ కూడా సహకారం అందజేయనుంది.ం

ఆరోగ్యశ్రీ పథకం కింద..
ఆరోగ్య శ్రీ పథకం కింద టార్గెటెడ్ ఇమేజింగ్ ఫర్ పీటర్ అనామలీస్ (టిఫా) స్కానింగ్ సేవలను ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. గర్భంలో ఉండగానే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని, పిండం ఎదుగుదలలో లోపాలను గుర్తించేందుకు టిఫా స్కాన్ దోహదపడుతుంది. గ్రహణంమొర్రి, గుండెలో రంధ్రం, కాళ్ల,చేతుల వంకరలు గుర్తించడానికి ఉపయోగపడుతుంది. . లోపాలుంటే సరిదిద్దుకునే వెసులుబాటు కలుగుతుంది. ఈ ఏడాది మే నుంచి ఆరోగ్యశ్రీ కింద గర్భిణులకు ఒక టిఫా, రెండు అల్ట్రా సౌండ్‌స్కాన్, మూడు అల్ట్రాసౌండ్‌స్కాన్ సేవలను ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ చర్యలను మహిళలు కొనియాడుతున్నారు.

అమ్మకు అండగా ప్రభుత్వం
గర్భం దాల్చినప్పటి నుంచి పండంటి బిడ్డకు జన్మనిచ్చి క్షేమంగా ఇంటికి తిరిగి వెళ్లే వరకు మహిళలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. ఆరోగ్యశ్రీ కింద ప్రవసించిన మహిళకు విశ్రాంతి సమయానికి భృతిగా రూ.5వేలు చొప్పున వైఎస్సార్ ఆసరా సాయాన్ని అందిస్తోంది. 108 అంబులెన్స్‌ల ద్వారా ఉచితంగా ఆసుపత్రులకు తరలించడం, ప్రసవానంతరం వైఎస్సార్ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా వారికి ఇంటికి చేరుస్తారు.

కాన్పులు..సీజేరియన్లు ఇలా..
అన్నమయ్య జిల్లాలో ఏప్రిల్ నెల నుంచి సెప్టెంబరు వరకు 14,137 మంది గర్భిణులు ఉన్నారు. వీరిలో 5,259 మంది సహజ ప్రసవాలు జరిగాయి. 4,654 సిజేరియన్ కాన్పులు జరిగాయి.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట



మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఈ క్రమంలో మాతృ మరణాల కట్టడికి చర్యలు తీసుకుంది. ఫలితంగా గతంలో పోలిస్తే మరణాలు తగ్గాయి. అదే విధంగా అనవసర సీజేరియన్ కాన్పుల నియంత్రణపై దృష్టి సారిస్తున్నాం.
-కొండయ్య,
డీఎంహెచ్‌వో, రాయచోటి

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న కారు

– డ్రైవర్‌కు గాయాలు

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండల కేంద్రమైన ఒంటిమిట్ట బస్టాండ్ దిగువన గల బ్రిడ్జి వద్ద ఆటోను కారు ఢీ కొన్న ఘటనలో ఆటో డ్రైవర్ కృష్ణమరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఒంటిమిట్ట మండలం రాచపల్లె గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కృష్ణమరాజు బుధవారం కడప నుంచి స్వగ్రామమైన రాచపల్లెకు వెళుతున్నాడు. కడప నుంచి తిరుపతి వైపు వెళుతున్న కారు ఆటోను వెనుక వైపు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. స్వల్ప గాయాలు కావడంతో పెను ప్రమాదం తప్పింది.

కౌన్సెలింగ్‌లో బ్రాంచులు మార్చిన నిందితుల అరెస్టు

రాజంపేట రూరల్ : అనధికారంగా ఓటీపీ నంబర్‌లను సేకరించి ఏపీ ఎంసెట్ కౌన్సెలింగ్‌లలో బ్రాంచ్‌లను మార్చిన వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వీఎన్‌కే చైతన్య తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం రూరల్ సీఐ కె.పుల్లయ్య, ఎస్ఐ ఎం.భక్తవత్సలంతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐటీఎస్ విద్యార్థి తలారి హేమంత్ కుమార్ తనకు ఎంసెట్ మొదటి కౌన్సెలింగ్‌లో వచ్చిన ఈసీఈ బ్రాంచ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు రెండవ విడత కౌన్సెలింగ్‌లో ఈఈఈ బ్రాంచ్‌గా మార్చినట్లు ఫిర్యాదు చేశాడన్నారు. ఓటీపీలను సేకరించి బ్రాంచ్‌లను మార్చి అవకతవకలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఎంసెట్ కౌన్సెలింగ్ విషయంలో తెలిసిన అధ్యాపకులు, కాలేజీలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విషపూరిత నీళ్లు తాగి మేకలు మృతి



మృతి చెందిన మేకలు

రాజంపేట : మండలంలోని ఊటుకూరు గ్రామ పరిధి కొండమిట్టలో విషపూరిత నీళ్లు తాగి తొమ్మిది మేకలు మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. షేక్‌చాంద్ బాషా, పొన్న గంటి లక్ష్మీదేవిలు దినసరిలో భాగంగా జీవాలను కొండమిట్టకు తోలుకెళ్లారు. అక్కడ నీటి గుంటలోని నీళ్లను మేకలు తాగాయి. అయితే అందులో గుర్తుతెలియని వ్యక్తులు రోగర్‌ను కలిపినందు వల్లనే ఆ నీటిని తాగి మృతి చెందాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వీఆర్వో బాషా సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతి చెందిన మేకల విలువ రూ.లక్ష ఉంటుందని అంచనా వేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

కొండాపురం : మండల పరిధిలోని బురుజుపల్లె, కొట్టాలపల్లె గ్రామాల మధ్య ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ ఆర్.మోహన్ తెలిపారు. 920 కేజీల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగుతోంది. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం మైదానంలో బుధవారం కడప, కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 244 పరుగులు చేసింది. జట్టులోని జాఫర్ అలీఖాన్ 60 పరుగులు, ఆదిల్‌హుస్సేన్ 63 పరుగులతో క్రీజులో ఉన్నారు. కర్నూలు సాబ్జాన్ బాషా 4 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు 65.4 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఫర్హాద్‌ఖాద్రి 40, సుబ్రమణ్యం 40 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు మల్లికార్జున, లోహిత్‌సాయికిశోర్ 2, ప్రదీప్‌రెడ్డి 2 వికెట్లు తీశారు.



కేఓఆర్ఎం మైదానంలో తలపడుతున్న నెల్లూరు, అనంతపురం జట్లు

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 78 పరుగులు చేసింది. జట్టులోని యోగానంద 37 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ అఖిల్ 2 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.



జాఫర్‌అలీ, కడప (60 పరుగులు)



ఆదిల్ హుస్సేన్, కడప (63 పరుగుల)



మల్లికార్జున, అనంతపురం (4 వికెట్లు)

మృత్యువుతో పోరాడి.. ఓడి!

- గణేష్ నిమజ్జనం ఊరేగింపులో దుర్ఘటన
- 20 రోజుల అనంతరం మృత్యు ఒడికి చేరిన యువకుడు



కిరణ్(ఫైల్)

రాజంపేట : వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్ పైనుంచి పల్టీ కొట్టి ప్రాణాల మీదకు తెచ్చుకున్న యువకుడు 20 రోజుల పాటు మృత్యువుతో పోరాడి చివరకు తనువు చాలించాడు. ఈ విషాద సంఘటన రాజంపేట పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని మన్నూరుకు చెందిన కిరణ్ (30) గతనెల 22న గణేష్ నిమజ్జనంలో ఉత్సాహంగా ట్రాక్టర్‌పై నుంచి విన్యాసం చేసి చివరికి ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటన సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తమ ప్రాంత వినాయకుని నిమజ్జనం ర్యాలీ భారీగా వాయిద్యాలు, బాణసంచాలను కాలుస్తూ పట్టణంలోని పాత బస్టాండుకు చేరుకుంది. ఈ క్రమంలో కిరణ్ ఉన్నఫళంగా ట్రాక్టర్ ఇంజిన్‌పై నుంచి పల్టీ కొట్టేందుకు ప్రయత్నించే క్రమంలో అదుపుతప్పి పడ్డాడు. దీంతో మెడ, తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నరాలు దెబ్బతినడంతో లాభం లేదని ఇంటికి తీసుకొచ్చారు. అప్పటి నుంచి 20రోజుల పాటు మృత్యువుతో పోరాడాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స చేయించినా ఫలితం లేకుండా పోయింది. మృతుడికి అమ్మానాన్నతో పాటు అన్న ఉన్నాడు.



వినాయక నిమజ్జన ర్యాలీలో పల్టీ కొట్టి పడిపోయిన కిరణ్(ఫైల్)

వైవీయూతో పోరుమామిళ్ల జీడీసీ ఎంఓయూ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మధ్య విద్య, పరిశోధన కార్యకలాపాలకు సంబంధించిన పరస్పర సహకారం కోసం అవగాహన ఒప్పందం కుదిరింది. వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, భౌతికశాస్త్ర విభాగాధిపతి ఆచార్య కె. కృష్ణారెడ్డి, పోరుమామిళ్ల భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వెంకట్రావు ఒప్పంద పత్రాలపై బుధవారం సంతకాలు చేశారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వి. వెంకట్రాము, డాక్టర్ రాఘవేందర్ పాల్గొన్నారు.

వైవీయూకు విద్యాశాఖ మంత్రి అభినందన

యోగివేమన విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏ గ్రేడ్ లభించడం పట్ల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అభినందించారు. మంగళవారం విజయవాడలో ఏపీ ఉన్నతవిద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ఐక్యూఏసీ సంచాలకులు డాక్టర్ లోకా సుబ్రమణ్యశర్మలను సత్కరించి జ్ఞాపిక అందజేశారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైవీయూ అధికారులు, పోరుమామిళ్ల అధ్యాపకులు

వైవీయూలో డిగ్రీ హానర్స్ ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరం నుంచి డిగ్రీ హానర్స్ ప్రారంభిస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. బుధవారం ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో వైవీయూ వీసీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని అనుసరించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ యేడాది నుంచి డిగ్రీ మూడో సంవత్సరం పూర్తయిన విద్యార్థులకు నాల్గవ యేడాది డిగ్రీ హానర్స్ చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. డిగ్రీ హానర్స్ పూర్తి చేసుకునే విద్యార్థులు నేరుగా పీజీ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. అదే విధంగా రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ద్వారా పీహెచ్‌డీలో సైతం ప్రవేశం పొందవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, ప్రవేశాల సంచాలకులు ఆచార్య కె. గంగయ్య, సీడీసీ డీన్ ఆచార్య రఘుబాబు, డిప్యూటీ డైరెక్టర్ టి. లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

ఏఎఫ్‌యూలో సెమిస్టర్ పరీక్షా ఫలితాల విడుదల

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని ఎం.ప్లాన్ (యూఆర్‌పీ) విభాగానికి సంబంధించిన 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్ ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరీక్షా ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత రావడం అభినందనీయమన్నారు. పరీక్షా ఫలితాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటిండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఇ.సి. సుప్రియ, ఉదయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, అధికారులు

నకిలీ కమిషనర్ అరెస్టు

- జల్సాలకు అలవాటు పడి.. సైబర్ నేరస్తుడిగా మారి..
- చివరకు పోలీసులకు చిక్కిన వైనం

గుంతకల్లు : ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యూవల్ పేరిట వసూళ్లు చేస్తున్న నకిలీ మున్సిపల్ కమిషనర్‌ను గుంతకల్లు పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల తాను గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌ను అంటూ ఓ సైబర్ నేరగాడు పట్టణంలోని కొంతమంది షాపు ఓనర్లను భయపెట్టి ఫోన్‌పే ద్వారా రూ.1000 చొప్పున వసూలు చేస్తున్న విషయం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ఓ ప్రకటన విడుదల చేస్తూ అపరిచిత వ్యక్తుల ఫోన్లు వస్తే స్పందించకుండా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, టూటౌన్ సీఐ గణేష్ నకిలీ మున్సిపల్ కమిషనర్ కోసం గాలింపు చేపట్టారు. బుధవారం ఈ సైబర్ నేరగాడు స్థానిక టీబీ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులకు చిక్కాడు. ఇందుకు సంబంధించిన వివరాలను పట్టణంలోని టూటౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. సైబర్ నేరగాడు వైఎస్సార్ జిల్లా బి.కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావుగా గుర్తించామన్నారు. కోర్టులో హాజరుపరుస్తున్నామన్నారు.

జల్సాల కోసమే సైబర్ నేరాలు..

బిల్లా నాగేశ్వరరావు ప్రైవేటు ఉద్యోగి. ఇతడు జల్సాలకు అలవాటు పడ్డాడు. భార్యకు విడాకులిచ్చి.. తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. జల్సాలకు అవసరమైన డబ్బును సమకూర్చుకునేందుకు ప్రభుత్వ అధికారుల హోదాను వాడుకుంటూ సైబర్ నేరాలకు పాల్పడుతూ వస్తున్నాడు. ఈ క్రమంలో తన పేరు జశ్వంత్‌రెడ్డి అలియాస్ సురేంద్రరెడ్డి పేర్లతో చలామణీ అవుతున్నాడు. ఇతనిపై వైఎస్సార్ జిల్లాతో పాటు తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లాలో ఐదు కేసులు నమోదయ్యాయి.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో నాగమల్లమ్మ (63) అనే వృద్ధురాలు అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. మైదుకూరు రహదారి పక్కన పడిపోయిన ఆమెను 108 అంబులెన్స్ సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె సాయంత్రం మృతి చెందింది. ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా చాపాడు మండలం ద్వారకానగర్‌కు చెందిన నాగమల్లమ్మగా గుర్తించారు. మృతురాలి బంధువులు ఔట్‌పోస్టులో సంప్రదించాలని మార్చురీ ఇన్‌చార్జి తేజా తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కత్తివారిపల్లె పంచాయతీకి చెందిన శ్రీనివాసులు (24), ఇంటర్మీడియట్ విద్యార్థి భవానీప్రసాద్ (17) ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో టేకుల పాళెం వద్ద ఎదురుగా వచ్చిన కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో భవానీప్రసాద్, శ్రీనివాసులు గాయపడగా స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా కురబలకోట మండలం ఎర్రమద్దివారిపల్లెకు చెందిన మణికంఠ(36) తన కుమారుడు ధనుష్(15),కుమార్తె సంధ్య(8)తో కలిసి ద్విచక్రవాహనంలో ముదివేడుకు వచ్చి తిరిగి ఎర్రమద్దివారిపల్లెకు వెళుతుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం వీరి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో మణికంఠ, సంధ్య తీవ్రంగా గాయపడగా, ధనుష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన ఇంటర్ విద్యార్థి భవానీప్రసాద్

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దమండ్యం : పెద్దమండ్యం- గుర్రంకొండ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. ఎస్ఐ రామాంజనేయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దమండ్యం గ్రామం పాతూరుకు చెందిన రెబ్బ చిన్నరవనప్ప వ్యవసాయం చేసుకుని జీవనం సాగించేవాడు. తొమ్మిది సంవత్సరాల క్రితం పెద్దమండ్యం నుండి వెళ్లి మదనపల్లె రూరల్ మండలం జగనన్న కాలనీ, అమ్మచెరువు మిట్టలో భార్య రామాంజులమ్మ (50)తో కలిసి కాపురం ఉంటున్నారు. భార్య రామాంజులమ్మ పెద్దమండ్యంలో ధనలక్ష్మి స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉంది. బ్యాంక్ ద్వారా సంఘం సభ్యులు తీసుకున్న రుణం తీరిపోవడంతో కొత్తగా సంఘానికి రుణ సహాయం చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ విషయమై భర్తతో కలిసి ద్విచక్రవాహనంలో మంగళవారం పెద్దమండ్యంకు వచ్చింది. బ్యాంక్‌లో పని చూసుకుని రాత్రి పెద్దమండ్యంలోని బంధువుల ఇంటిలో ఉండి, బుధవారం మదనపల్లెకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో వడ్డిపల్లె వద్ద ద్విచక్రవాహనం నుండి కింద పడిపోయింది. అదే సమయానికి గాలివీడు వైపు వస్తున్న మదనపల్లె 2 డిపో బస్సు రామాంజులమ్మ తలపై వెళ్లడంతో తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రామాంజులమ్మ

అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించాలి

ప్రొద్దుటూరు : రానున్న మూడు నెలల కాలంలో ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని కోరారు. స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాంబర్‌లో బుధవారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ మట్కా, గుట్కా, బెట్టింగ్, ఇసుక అక్రమ రవాణా, వ్యభిచారం లాంటి అసాంఘిక కార్యకలాపాలను మూడు నెలల్లో పూర్తిగా నిర్మూలించాలని, లేకుంటే తానే ఉద్యమిస్తానని అన్నారు. ప్రొద్దుటూరులోనే బెట్టింగ్ ఉన్నట్లు దానిని తాను ప్రోత్సహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించారన్నారు. పోలీసు రికార్డుల్లో 2007 నుంచే ఇక్కడ బెట్టింగ్ కేసులు నమోదైనట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న బెట్టింగ్ నిర్వాహకుల్లో 90 శాతం మంది వరద వెంట గతంలో నడిచిన వారేనన్నారు. బెట్టింగ్ నిర్వాహకుడు ఖాదర్‌బాద్ నరసింహాకు చెందిన రూ.8 కోట్ల నగదును సీజ్ చేస్తే వరద డీజీపీ వరకు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వరద ఎందుకు అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించలేకపోయారన్నారు. కేవలం టీడీపీ టికెట్ రేసులో ముందు వరుసలో ఉండేందుకే ఉద్దేశ పూర్వకంగా వరదరాజులరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తనను విమర్శిస్తున్నారన్నారు. తాను చేసే సహాయ కార్యక్రమాలతోపాటు చివరికి రాజన్న భోజనం కూడా క్రికెట్ బుకీల డబ్బుతోనే నిర్వహిస్తున్నాని విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ ఖాజామొహిద్దీన్, ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాలిన గాయాలతో వృద్ధురాలి మృతి

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండలంలోని కొండమాచుపల్లె గ్రామానికి చెందిన చేపూరి వెంకటసుబ్బమ్మ (61) అనే వృద్ధురాలు చీరకు మంటలు అంటుకోవడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. వెంకటసుబ్బమ్మ ఈనెల 6వ తేదీన నీళ్లు కాచుకునేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించగా ప్రమాదవశాత్తు మంటలు ఆమె చీరకు అంటుకుని గాయపడిందన్నారు.

సిరులివ్వని విరులు

- పూల ధరలు పతనం
- రెండునెలల కిందట కిలో రూ.50..నేడు రూ.5
- లబోదిబోమంటున్న రైతులు



గుర్రంకొండలో కోతకోయకుండా పూలతోటల్లో ఉన్న పూలు

గుర్రంకొండ : పూల ధరలు మార్కెట్లో భారీగా పతనమయ్యాయి. ప్రస్తుతం కిలో రూ.5 పడిపోయాయి. కర్ణాటక రాజధాని బెంగుళూరు మార్కెట్లో పూలను రాశులుగా పోసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. రెండునెలలుగా మార్కెట్లో పూల ధరలు పుంజుకోక పోవడంతో రైతులు నష్టపోయారు. దీంతో చేసేదేమీ లేక పూలను కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు రైతులు.

3250 ఎకరాల్లో పూల సాగు

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 3250 ఎకరాల్లో వివిధ రకాల పూలతోటల సాగు చేపట్టారు. ప్రస్తుతం అన్ని తోటలు అదునుకొచ్చి దిగుబడి ప్రారంభమైంది. ఎకరం పూలతోట సాగు చేయాలంటే రూ.1.50లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుంది. పూలనారు కొనుగోలు నుంచి కోతకొచ్చేవరకు రైతులకు ఈ పాటి ఖర్చు వస్తుంది. మార్కెట్లో కనీసం కిలో పూల ధర రూ.30 నుంచి 50లోపు ఉంటే రైతుకు పెట్టుబడి చేతికొస్తుంది. రెండునెలల కిందట మార్కెట్లో కిలో వివిధ రకాలను బట్టి రూ. 50 నుంచి రూ.100 వరకు ధరలు పలికాయి. తదనంతరం పరిణామాలతో బంతిపూల ధరలు మార్కెట్లో రోజురోజుకు తగ్గిపోయాయి. ప్రస్తుతం పూలధరలు కిలో రూ.5 వరకు పలుకుతుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. గతంలోఇదే సీజన్‌లో కిలో రూ. 60 వరకు పలికింది. అదే ఆశతో రెండునెలలుగా పూలతోటల పెంపకం చేపట్టిన రైతులకు నిరాశే మిగిలింది. ఇటీవల పెద్దగా శుభ కార్యాలు జరగకపోవడంతో ప్రస్తుతం మహాలయ పక్షాలు నడుస్తుండడంతో పూలకు డిమాండ్ తగ్గిపోయింది. దీంతో ధరలు ఒక్కసారిగా పాతాళానికి పడిపోయాయని వ్యాపారులు అంటున్నారు.

కొనుగోలుకు మొగ్గుచూపని వ్యాపారులు

వ్యాపారులు ప్రస్తుతం పూలకొనుగోలు వైపు మొగ్గుచూపడం లేదు. జిల్లాలో సాగు చేసేపూలను మదనపల్లె, కడప, తిరుపతి, బెంగళూరు, చెన్నై లాంటి పట్టణాలకు తరలిస్తుంటారు. ఇటీవల పూల బస్తాలతో బెంగళూరు మార్కెట్‌కు వెళ్లిన రైతులకు కనీసం పూలను వ్యాపారులు కొనుగోలు చేయని పరిస్థితి నెలకొంది. దీంతో చేసేదిలేక అక్కడే పూలను రాశులుగా పోసి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేసి వెనుదిరిగారు. జిల్లాలోని పలు పట్టణాల్లో వ్యాపారుల నుంచి పూలు కొనలేము అనే మాటలు వినిపిస్తుండడంతో అక్కడే పారబోసి వదిలేసి వచ్చేస్తున్నారు.

తోటల్లో వదిలేస్తున్న రైతులు

పూలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు చేసేదిలేక పూలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు. 35 కిలోల పూల బస్తా బెంగళూరుకు తరలించాలంటే రూ. 200 వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో కిలో పూల ధర రూ5 పలుకుతోంది. ఈ లెక్కన ఒక బస్తా కు రూ.175 మాత్రమే ఒక్కోసారి గిట్టుబాటు లభిస్తుంది. రైతులకే చేతి నుంచి రూ.25 అదనంగా పడుతోంది. దీంతో పూలను మార్కెట్లకు తరలించినా ప్రయోజనం లేదని భావించి కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నారు.ఇప్పటికే టమాటా, కూరగాయల తోటల సాగుతో తీవ్రంగా నష్టపాయిన రైతులు బంతి పూలసాగుపై ఆశపెట్టుకోగా ప్రస్తుతం వారి ఆశలు అడియాశలయ్యాయి.

తోటల్లోనే వదిలేస్తున్నాం



పూలకు గిట్టుబాటు ధరలు లభించలేదు. పెరుగుతాయనే ఆశలు రోజురోజుకు సన్నగిల్లుతున్నాయి. వ్యాపారుల కూడా పూల వైపు కన్నెత్తిచూడడం లేదు. కష్టాలు పడి మార్కెట్‌కు తరలించినా చేతినుంచి అదనంగా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. అందుకని పూలను కోయకుండా తోటల్లోనే వదిలేస్తున్నాము.

– రెడ్డిమోహన్, పూలరైతు, చెరువుమొరవపల్లె

పెట్టుబడి నష్టపోయాం



రెండు ఎకరాల్లో పూలతోటలు సాగు చేశాను. ఇప్పటివరకు రూ. 3 లక్షలు ఖర్చు వచ్చింది.ప్రస్తుతం మార్కెట్లో పూల ధర రూ.5 పలుకుతోంది, దీంతో మార్కెటకు తరలించినా నష్టపోతున్నాము. గత ఏడాది ఇదే సీజన్‌లో వ్యాపారులు తోటల వద్దకే వచ్చి పూలను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఎవరూ రావడం లేదు. ఒక్క రూపాయి కూడా చేతికి అందపోవడంతో పెట్టుబడి నష్టపోయాం.

– రమణమ్మ, పూలరైతు, కొత్తపల్లె